క్లుప్తంగా

వర్క్యూరులో ఉరుసు



దర్గాకు గంధాన్ని తీసుకెళుతున్న పీఠాధిపతి

కోడుమూరు రూరల్: మండలంలోని వర్క్యూరులో వెలసిన శ్రీసద్గురు ఖాజాహుసేన్ దాస్ స్వామివారి ఉరుసును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, పకీర్ల విన్యాసాల మధ్య పీఠాధిపతి సద్గురు ఖాజా సుభహాన్ హుసేన్‌దాస్ ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చారు. పూజల అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ రామక్రిష్ణ తెలిపారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 9 గంటలకు లెక్కింపును ప్రారంభిస్తామని చెప్పారు.

పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

కర్నూలు (టౌన్) : 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి వడ్డీ మాఫీని పొందాలని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపు కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు. వడ్డీమాఫీ గడువు ఈనెల 31 వ తేదీతో ముగుస్తుందని తెలిపారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేష పూజలు నిర్వహించారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, హనుమంతు శర్మ, అర్చకులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహ వాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన తర్వాత ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొని స్వామివారి పల్లకీని మోస్తూ ఓం నమో మహానందీశ్వరాయ అంటూ భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

బైక్ నుంచి కిందపడి మహిళ మృతి

జూపాడుబంగ్లా: జోగులాంబ గద్వాల జిల్లాలోని మరకల్ వద్ద బైక్‌పై నుంచి కిందపడి జూపాడుబంగ్లాకు చెందిన జంగాల మాధవి(24) మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు... జూపాడుబంగ్లాకు చెందిన జంగాల మాధవి, భర్త బాలరాజు యాచక వృత్తితో పాటు చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ సంచార జీవనం చేసేవారు. అందులో భాగంగా వారు జోగులాంబ గద్వాల జిల్లా మరకల్ గ్రామ సమీపంలో గుడారాలు వేసుకొని జీవిస్తున్నారు. శుక్రవారం మాధవి ఆమె తమ్ముడు కలిసి ద్విచక్రవాహనంపై వ్యాపారం ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడింది. తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108లో తరలిస్తుండగా మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించటంతో వారు జూపాడుబంగ్లాలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆరోగ్య సంజీవని

ప్రాంతం ఏదైనా ప్రమాదం జరిగిన సమాచారం అందుకున్న క్షణాల్లోనే కుయ్ కుయ్ అంటూ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను అంబులెన్స్‌లో ఎక్కించుకుని ప్రభుత్వాస్పత్రులకు చేరవేస్తూ ప్రాణాలను కాపాడుతోంది 108 వాహనం. ప్రమాదాలు, కాన్పులు, గుండె జబ్బులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులను క్షణాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు పోస్తూ ఆరోగ్య సజీవనిగా నిలుస్తోంది. ఇంతటి ప్రాముఖ్యత గల వాహనాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. వాహనాల్లో అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేసి వాటి సంఖ్యను సైతం భారీగా పెంచింది. అలాగే ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందిస్తోంది.

ప్రాణాలు కాపాడుతున్న 108, 104 అంబులెన్స్‌లు

- వాహనాల్లో అత్యాధునిక సౌకర్యాల కల్పన
- మారుమూల పల్లెల్లో సైతం ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- అత్యవసర పరిస్థితుల్లో భరోసా
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గడివేముల మండలంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు (ప్రతి నెలా)

బీపీ	1137
షుగర్	443
బీపీ, షుగర్	1075
గర్భిణులు	357
బాలింతలు	126
మంచానికే పరిమితమైన రోగులు	49
రక్తహీనత	45
మొత్తం	3183

గడివేముల: సమయానికి ఆస్పత్రికి వెళ్లలేక ఏ ఒక్క ప్రాణం పోకూడదన్న ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 108 వాహనాలను తీసుకొచ్చారు. ఈ వాహనాలు ఎందరి ప్రాణాలనో కాపాడగలిగాయి. అయితే గత టీడీపీ ప్రభుత్వం 108 వాహనాలను నిర్లక్ష్యం చేసింది. నిర్వహణ లోపంతో చాలా వాహనాలు మూలనపడ్డాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. మండలానికి ఒక 108 అంబులెన్స్‌తో పాటు పల్లె ప్రజలకు వైద్యం అందించడానికి 104 వాహనం అందుబాటులోకి తెచ్చింది. అత్యాధునిక వైద్య సదుపాయాలతో పాటు మొదటిసారిగా చిన్నారుల కోసం నియోనేటల్ కేర్ అంబులెన్స్‌లు సైతం రావడంతో మాతాశిశు సంరక్షణతో పాటు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలు కాపాడుతున్నాయి. 108, 104 అంబులెన్స్‌లు గత తెలుగుదేశం పాలనలో మరుగున పడిపోయాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటికి పూర్వ వైభవం తీసుకొచ్చింది. మారుమూల గ్రామాల ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తోంది.

ఇంటి వద్దకే వైద్య సేవలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి, వైద్యానికి పెద్దపీట వేసింది.ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తోంది. ప్రతి మండలానికి ఒక 104 వాహనాన్ని ఏర్పాటు చేసింది. వైద్యులు ప్రతి గ్రామంలో దీర్ఘకాలిక రోగాల బారిన పడిన వారికి, మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. ఆరోగ్య జాగ్రత్తలు, సూచనలు చేస్తున్నారు. ముఖ్యంగా 104 వాహనం వద్ద బీపీ, మలేరియా, టీబీ, లెప్రసీ, షుగర్ తదితర రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ సేవల విస్తరణ

పేదలు రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నారు. 3,257 ప్రొసీజర్‌లతో రూపకల్పన చేశారు. రూ.5 లక్షల ఉన్న పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. ఎలాంటి జబ్బుకైనా కార్పొరేట్ వైద్యం పొందే అవకాశం లభించింది.

సకల సదుపాయాలతో 108 వాహనాలు

కాలం తీరిన అంబులెన్స్‌లను పక్కన పెట్టి అధునాతన సదుపాయాలు కలిగిన అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అంబులెన్స్‌లో ఆక్సిజన్, స్పైన్‌బోర్డు, స్కూప్ స్ట్రెచర్, వీల్‌చైర్, బ్యాగ్ మాస్క్, మల్టీ పారామానిటర్ వంటి అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేసింది.



108 అంబులెన్స్‌లో ప్రసవించిన బిడ్డను చూపుతున్న వైద్య సిబ్బంది



గడివేముల 108 అంబులెన్స్ వద్ద సిబ్బంది



మంచానికే పరిమితమైన వ్యక్తికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి జబీనా (ఫైల్)

పైసా ఖర్చు లేకుండా కాన్పు



గతంలో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసుకుని మందులు తెచ్చుకునే దాన్ని. ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ గ్రామంలోనే వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. నేను గర్భిణీగా ఉన్నప్పటి నుంచి ఇంటి వద్దకే వచ్చి సేవలు అందించారు. గత నెల 108 వాహనంలో వెళ్లి ప్రభుత్వాస్పత్రిలో కాన్పు చేయించుకున్నాను. కవల పిల్లలు పుట్టారు. పైసా ఖర్చు కాలేదు. చాలా సంతోషంగా ఉంది.

– తలారి సుభాషిణి, ఒండుట్ల గ్రామం, గడివేముల మండలం

ఉచితంగా మందులు



ప్రతి నెలా మా ఊరికి 104 అంబులెన్స్ వస్తుంది. అంబులెన్స్ వచ్చే ముందు ఆశా కార్యకర్త ఇంటి వద్దకు వచ్చి సమాచారం ఇస్తుంది. నాకు బీపీ సంబంధించిన వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు ఉచితంగా ఇస్తున్నారు. గ్రామంలోనే మందులు ఇస్తుండడంతో ఇబ్బందులు తొలగాయి. పేదవాడికి ఇలాంటి ఒక రోజు వస్తుందని ఊహించలేదు. జగన్ ప్రభుత్వ పాలన భేష్.

–నాగన్న, బూజునూరు గ్రామం

ప్రతి పల్లెకు 104 సేవలు



మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి 104 అంబులెన్స్ ద్వారా సేవలు అందిస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నాం. ప్రభుత్వం 104 వాహనంలో అత్యాధునిక పరికరాలతో పాటు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసింది. వైద్య శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.

–డాక్టర్ మొల్లాజబీన్, గడివేముల



కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్నత విద్యావంతుడు, వైద్యుడు ఆదిమూలపు సతీష్‌ను గెలిపించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఎమ్మిగనూరులో జరిగిన మేమంతా సిద్ధం సభలో ఆయన్ను ప్రజలకు పరిచయం చేశారు.

ఏసు మార్గం అనుసరణీయం



కల్లూరు: క్రీస్తు శిలువ యాత్ర



ఓర్వకల్లు: శిలువతో ర్యాలీగా వెళుతున్న క్రైస్తవులు

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు

పాణ్యం: మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా చర్చిల్లో క్రైస్తవులు ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాణ్యంలోని షాలేము ప్రార్థన మందిరంలో పాస్టర్ ఎలిసా ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలని, ఇతరులకు సహాయం చేయడమే ఏసు మార్గమమని పాస్టర్లు ఉపదేశించారు.

లోక రక్షకుడు ఏసు

సి.బెళగల్: ఏసు మార్గం అనుసరణీయమని, లోకాన్ని రక్షించడానికి ఏసు గుడ్‌ఫ్రైడే రోజు పరలోకానికి చేరుకుని మూడు రోజులు సమాధి అనంతరం, ఈస్టర్ రోజు (ఆదివారం) తిరిగి సజీవుడు అయ్యాడని సి.బెళగల్ ఏబీఎం చర్చి పాస్టర్ సులోమన్ అన్నారు. స్థానిక చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. భక్తిగీతాలు ఆలపించారు. బైబిల్ సారాంశాన్ని వివరించారు. అలాగే పోలకల్, ఇనగండ్ల, కంబదహాల్, ముడుమాల, కొత్తకోట, బురాన్‌దొడ్డి, కొండాపురం గ్రామాల్లోని క్రైస్తవ మందిరాల్లో ఏసు సందేశాన్ని బోధించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన, ప్రేమ, కరుణ, జాలి, దయ, క్షమాగుణం, ఓర్పు కలిగి ఉండాలని.. అలాంటి వారినే ఏసు ప్రేమిస్తారని తెలిపారు.

కల్లూరు: మండలంలోని గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. బస్తిపాడు చింత వనంలో పాస్టర్ పీటర్ క్రీస్తు మార్గం, బైబిల్ సారాంశాన్ని వివరించారు. పందిపాడు గ్రామంలోని రక్షణ మందిరం ఆధ్వర్యంలో పాస్టర్ సువర్ణ రాజు క్రీస్తు సిలువ యాత్ర చేశారు. గ్రామంలో ప్రారంభమై ముజఫర్‌నగర్, గోవర్ధన్‌నగర్, మాదిరాజునగర్, బీఆర్ రెడ్డి కాలనీ ప్రాంతాల్లో యాత్ర సాగింది. కార్యక్రమానికి కర్నూలు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కన్నా ముఖ్య అతిథిగా హాజరై క్రీస్తు శిలువ యాత్రను ప్రారంభించారు. పాస్టర్ క్రీస్తు బోధనల గురించి వివరిస్తూ అందరూ ఆయన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓర్వకల్లు, హుస్సేనాపురం, శకునాల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, బ్రాహ్మణపల్లె తదితర గ్రామాల్లో ప్రార్థనలు జరిగాయి. ఓర్వకల్లులో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రె..ఆనంద ర్‌రావు, సంఘస్తుల ఆధ్వర్యంలో స్థానిక పాత చర్చి నుంచి కొత్త చర్చి వరకు శిలువతో ర్యాలీ నిర్వహించారు. ఏసు సందేశాలను వినిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గడివేముల: మండలంలోని మంచాలకట్టలో ఫాదర్ జోసెఫ్ ఆధ్వర్యంలో శిలువ యాత్ర జరిగింది. ఏసు పాటలు ఆలపిస్తూ యాత్ర సాగింది. క్రీస్తు పలికిన ఏడు వ్యాఖ్యాలను గుర్తు చేసుకున్నారు.



సి.బెళగల్‌లో ప్రసంగిస్తున్న ఏబీఎం చర్చి పాస్టర్



పాణ్యం: ఆలమూరులో..



సి.బెళగల్: ప్రార్థనలో పాల్గొన్న భక్తులు





సి.బెళగల్ నుంచి మేమంతా సిద్ధం సభకు బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు.. కొత్తకోట నుంచి..



పోలకల్ నుంచి.

మేమంతా సిద్ధమే

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు భారీగా తరలివెళ్లిన పార్టీ నాయకులు, అభిమానులు
- గ్రామాల్లో పండుగ వాతావరణం
- జై జగన్ నినాదాలతో మార్మోగిన పరిసరాలు



వర్క్యూరులో సీఎం రాక కోసం ఎదురు చూస్తున్న మహిళలు

కోడుమూరు రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం బస్సు యాత్రగా శుక్రవారం కోడుమూరుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని చూసేందుకు వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, మహిళలు భారీగా తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా జగనన్నకు స్వాగతం పలికేందుకు ఉదయం నుంచే కోడుమూరు పాతబస్టాండ్ సెంటర్‌లో రోడ్డుకిరువైపులా వేచివున్నారు. మహిళలు, చిన్నారులు సైతం గంటల తరబడి మిద్దెలపైకెక్కి ఎదురుచూశారు.

భారీగా తరలివెళ్లిన జనం

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఎమ్మిగనూరులో నిర్వహించిన సభకు కోడుమూరు మండలం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలి వెళ్లారు. మండలంలోని ఏ గ్రామం చూసినా సిద్ధం సభకు తరలివెళుతున్న నాయకులు, ప్రజలే కన్పించారు. కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీపీ రూతమ్మ, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్‌రెడ్డి, మాధవి, సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రవీణ్, ఉపసర్పంచ్ మాదులు, నాయకులు ప్రవీణ్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో అభిమానులు, ప్రజలు తమ అభిమాన నేతను చూసేందుకు వాహనాల్లో భారీగా తరలివెళ్లారు.

సి.బెళగల్: సి.బెళగల్ మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. పోలకల్ గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు పులిరాజు, సోమప్ప ఆధ్వర్యంలో.. సి.బెళగల్లో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు ముందరింటి వెంకటేష్, గోపాల్, మద్దిలేటి, హారుణ్, రామకృష్ణ, సర్పంచ్ పాండురంగన్న, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా ఆధ్వర్యంలో భారీగా వెళ్లారు. కె.సింగవరం, బురాన్‌దొడ్డి నుంచి శేశిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బ్రాహ్మణదొడ్డిలో సర్పంచ్ దస్తగిరి, కొత్తకోటలో శ్రీనివాసులు, ప్రభాకర్, నబిరసూల్, గణేష్ తదితరులు ఆధ్వర్యంలో సభకు తరలివెళ్లారు.

ఘనస్వాగతం పలికిన వర్క్యూరు వాసులు

సి.బెళగల్: వర్క్యూరు గ్రామస్తులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. సీఎం తమ గ్రామం మీదుగా వెళుతున్నారన్న విషయం తెలుసుకున్న వర్క్యూరు గ్రామస్తులు ఉదయం 8:30 గంటల నుంచి రోడ్లపైకి వచ్చారు. ఎండ ఎక్కువగా ఉండడంతో స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన షామినా కింద మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఓపికగా ఎదురు చూశారు. మధ్యాహ్నం 12:20 గంటలకు సీఎం బస్సు రావడంతో రోడ్డు వెంబడి, బస్సుపై పూలుచల్లి ఘనస్వాగతం పలికారు. స్థానికుల ప్రేమను చూసిన సీఎం వైఎస్ జగన్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యలు బస్సును ఆపి స్థానికులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన మిన్నెలహుసేన్, సర్పంచ్ దస్తగిరి, కృష్ణారెడ్డి, యువత సీఎంతో సెల్ఫీ తీసుకుని సంబరపడ్డారు.

గూడూరు నుంచి..

గూడూరు: ఎమ్మిగనూరు సభకు గూడూరు నుంచి భారీగా తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ కన్వీనర్ జె.ఆబేల్, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో 20 బస్సుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.







కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో.. కోడుమూరు, గూడూరు నుంచి వెళుతున్న మహిళలు నాయకులు, అభిమానులు

రైతుల అభ్యున్నతికి దోహదపడాలి

- ఇన్‌పుట్ డీలర్లతో ఆత్మ పీడీ పీఎల్ వరలక్ష్మి



ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహిస్తున్న పరీక్షను పర్యవేక్షిస్తున్న ఆత్మ పీడీ, డీపీడీలు

కర్నూలు(అగ్రికల్చర్): రైతులపై సేవాభావం కలిగి వారి అభ్యున్నతికి దోహదపడాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. స్వార్థం,లాభాపేక్ష లేకుండా రైతులకు అన్ని విధాలా సహకరించాలని ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లొమో కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ... దేశీ కార్యక్రమం ద్వారా ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయ పరిజ్ఞానం, ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల చట్టాలు, ఆహార కల్తీ నియంత్రణ చట్టాలు తదితర వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలుసుకున్న వాటిని రైతులకు వివరించి నాణ్యమైన ఇన్‌పుట్ అందే విధంగా తోడ్పాటు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ... ఆహార కల్తీ ఎలా జరుగుతుంది... దానిని ఎలా కనిపెట్టాలని వివరించారు. నేడు పసుపు, మిరియాలు, ఆవాలు, కారం, వంట నూనెలు ఇలా అనేకం కల్తీ అవుతున్నాయని పేర్కొన్నారు. ఆహార కల్తీ నియంత్రణ చట్టం గురించి తెలుసుకొని రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కల్తీ ఆహారం తీసుకోవడం ద్వారా తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. అనంతరం ఇన్‌పుట్ డీలర్లకు డిప్లొమో కోర్సుపై పరీక్ష నిర్వహించారు. పరీక్షను ఆత్మ పీడీ వరలక్ష్మి, డీపీడీ శ్రీలత, దేశీ కోర్సు సమన్వయ కర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర పరీక్షను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలం క్షేత్ర పరిధిలోని దుకాణదారులు ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించాలని ఈఓ డి.పెద్దిరాజు సూచించారు. శుక్రవారం క్షేత్ర పరిధిలోని దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. దుకాణదారులు భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. శుచీ, శుభ్రతలను పాటించాలన్నారు.